# అమ్మో నా కోడి

**గుజ్జేటి గణేష్**

**కోళ్ళ కొమరయ్య కోడిపుంజు పోయిందన్న వార్త క్షణాల్లో వాడకట్టంతా పాకిపోయింది.**

**ఆ వార్త విన్న వారంతా కాస్తోకూస్తో వణికి పోసాగారు. ఎందుకంటే; గతంలో ఇలాగే ఒక కోడిపోతే కోళ్ళ కొమరయ్య చేసిన గొడవ అంతా ఇంతా కాదు!**

ఇళ్ళల్లో దూరి సందులుబొందులు వెదకడమేకాక, వండిన కుండల్నిసైతం క్రిందామీదా చేశాడు.

అందుకే, ఇప్పుడు కూడా ఎక్కడ ఇళ్ళమీద ఊడిపడి రభస చేస్తాడోనని అందరూ ఎవరి ఇళ్ళల్లో వారు బిక్కు బిక్కుమంటూ ఉండిపోయారు.

వాళ్ళు భయపడ్డట్టుగానే కొమరయ్య అరుపులు మొదలయ్యాయి.

"నంగనాచి ముం..."! ఎన్నిసార్లు చెప్పానే... ఇంటికాడే ఉండి జాగర్తగా కోళ్లను కనిపెట్టి ఉండమని. ఇల్లిడిచిపోయి ఎక్కడ తొంగున్నావే! బంగారం లాంటి కోడిపుంజు... కోళ్ళ పందేలకని సెప్పికొని తెచ్చా... దాన్ని నా పోరగండ్లకంటే జాస్తి పేమగా సూసుకుంటున్నా! దాన్ని ఈయాల్ల నోమి కూసున్నావు గదే!" అంటు భార్యను బజార్లోనే జుట్టు పట్టి నాల్గు తన్నాడు.

రంగి వలవల ఏడుస్తూ "లేదు మావా! నేను యాడిం పోలేదు. ఇంటి పట్టునే ఉండి కోళ్ళను కనిపెడ్తూ ఉన్నా... ఒట్టు! ఇప్పటిదాకా కోడిపుంజు ఇటిటే తిరిగింది... ఉన్నట్టుండి ఇప్పటికిప్పుడే ఎటు మాయమైందో" అంది కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"ఎటు మాయమవుద్దే సుప్పనాతి ముఖమా... ఆ యన్ని మాటలు నా కాడ సెప్పమాకు! అదిపోయి ఎంత సేపయిందో... ఎవతి పట్టుకొని గోసిలో పెట్టుకుందో ఎవడు, కోసుకొని కమ్మగా మింగేసిండో. నేను నీ మాటలు నమ్మనే రంగి..." అంటు కేకలేయసాగాడు.

రంగి, కొమరయ్య కోడిపుంజును వెదకడం మొదలెట్టారు. కొమరయ్య బండబూతులు తిడుతూ ఎవరైనా పట్టుకుంటే మర్యాదగా వదిలెయ్యమని కేకలేస్తున్నాడు.

రంగి మాత్రం; ఇక ఈ రోజు కోడిపుంజు దొరక్కపోతే తన మక్కెలిరగడం ఖాయం అన్న భయంతో మౌనంగా కోడిపుంజును వెతుకుతూ ఇంటి వెనకాల పెరట్లోకెళ్ళిన రంగి ఒక్కసారి "ఓయ్ మావోయ్..." అంటూ బిగ్గరగా అరిచింది.



భార్య అరుపు విన్న కొమరయ్య కోడిపుంజు దొరికిందనుకొని పరుగుపరుగున పెరట్లోకి వచ్చి "ఏదే రంగీ... నా బంగారు కోడిపుంజు ఏదీ...?" అని ఉత్సాహంగా అడిగాడు.

"కోడిపుంజు కాదయ్యా... అటు సూడూ" అని పొలం గట్టుపై నిండా గొంగళి కప్పుకొని కూర్చున్న ఒక మనిషిని చూపించింది.

భార్య చెప్పేదేంటో కొమరయ్యకు బోధపడలేదు. "నువ్వు సూపెట్టేదేంటే...?" అన్నాడు కోపంగా.

"మన కోడిపుంజును మత్తగాలిపింది వాడే."

"నీకెట్టా తెలుసే...?".

"అదిగో... ఆ సేతులు కదులుతుంటే తెలియట్లేదూ!"

"అంటే...?"

"అదేనయ్యా! వాడు మన కోడి పుంజును తెగ్గోసి బూరు పీకుతున్నడు. మంచిగా... పరీచ్చ చేసి సూడూ" కాస్త మందలించినట్టుగానే అంది రంగి.

భార్య చెప్పినట్టుగానే కొమరయ్య పొలం గట్టుమీద నిండా గొంగళి కప్పుకొని కూర్చున్న మనిషికేసి పరీక్షగా చూశాడు. రంగి అన్నట్టుగానే ఆ మనిషి చేతులు ఏదో పనిచేస్తున్నట్టుగా కన్పించేసరికి కొమరయ్యకు కూడా భార్యమాటపై నమ్మకం కుదిరింది.

"ఔనే రంగీ... నీ మాట నిజమే! వాడు మన కోడిపుంజు బూరే పీకుతున్నాడు. నువ్విక్కడే ఉండు... నేనుపోయి వాణ్ణి పట్టుకుంటా" అని పంచె పైకి చెక్కిపిల్లిలా అడుగులేస్తూ వెళ్ళాడు.

పొలం గట్టును సమీపించిన కొమరయ్య క్షణం కూడా ఆలస్యం చేయకుండా గబుక్కున గట్టుపై కూర్చున్న వాడిపై లంఘించబోయాడు.

కానీ, అంతలోనే గట్టుపై కూర్చుండి చకచకా గడ్డి కోస్తున్న ముసలాయన చటుక్కున తలెత్తి కొమరయ్య ను చూసి నెత్తిమీది గొంగళి తీస్తూ "ఏరా కొమరా... కోడిపుంజు దొరికిందా?" అని చల్లగా అడిగాడు.

ఆ ముసలాయన్ని చూస్తూనే కొమరయ్య కోపం క్షణాల్లో మటుమాయమైంది.

"నువ్వాయే మామా! నువ్వు గడ్డి కోస్తుంటే సూసి నేనూ నీ కొడలు... ఎవడో కోడిపుంజునే కోసి బూరు పీకుతున్నాడనుకున్నాం. నువ్వు సూడబట్టి మంచిదైంది. లేకుంటే; ఈ కట్టెతో నీ నెత్తి పగులగొట్టే వాణ్ణి" అంటూ పకపక నవ్వాడు కొమరయ్య.

గుజ్జేటి గణేష్
సి.ఇ. నెం. 502252
ఎ.పి.ఎస్.ఆర్.టి.సి డిపో
ఆర్మూర్.